సాక్షి
అనంతపురం
మంగళవారం । 28 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.17

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/11.1°

జిల్లా అంతటా సోమవారం చలి వాతావరణం కొనసాగింది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ పద్మశ్రీ

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గత డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ విడుదల చేశారు. బీఏలో 62 శాతం, బీకాంలో 57, బీఎస్సీలో 60, బీబీఏలో 48 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సెమిస్టర్‌తో పాటు నవంబరు 2024లో నిర్వహించిన మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి రీవాల్యుయేషన్ కోసం ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 4 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మశ్రీ సూచించారు. కార్యక్రమంలో కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రామకృష్ణ, పరీక్షల విభాగం అధికారులు చలపతి, శ్రీనివాసులు, నాగార్జున, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

- ఎస్పీ జగదీష్



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం సెంట్రల్: రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరమవుతాయని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని రవాణాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో కేఎస్ఆర్ జూనియర్ కళాశాల వద్ద నుంచి టవర్‌క్లాక్ వరకూ మెగా వాకథాన్(ర్యాలీ) నిర్వహించారు. టవర్‌క్లాక్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే సమయంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. సెల్‌ఫోన్ వాడుతూ వాహనాలు నడుపుతుండటంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై ప్రజలను జాగృతం చేయడానికి ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకూ రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఉప రవాణా కమిషనర్ వీర్రాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు విపత్తులా తయారయ్యాయన్నారు. ప్రమాదాల్లో వ్యక్తి మృతి చెందితే కుటుంబ సభ్యుల పరిస్థితి వర్ణనాతీతంగా మారుతోందన్నారు. రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన పెంచేందుకు మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీఓలు సురేష్ నాయుడు, రమేష్, ఎంవీఐలు శ్రీనివాసులు, సునీత, మనోహర్‌రెడ్డి, రఘునాథ్, లహరి, కేఎస్ఆర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు, ఆటోమొబైల్ డీలర్లు, డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నంది విగ్రహం అపహరణ



అపహరణకు గురైన నంది విగ్రహం ఇదే (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంట గ్రామ సమీపంలో బసవేశ్వరుడి సమాధిపై ఏర్పాటు చేసిన నంది విగ్రహాన్ని ఆదివారం రాత్రి దుండగులు అపహరించారు. గతంలో ఈ సమాధికి అనుకుని ఉన్న పొలం రైతు వద్ద ఉన్న ఎద్దు కరువు సమయంలో కాలు దువ్వి రంకె వేస్తే ఆ రోజు కచ్చితంగా వర్షం పడుతుండేది. దీంతో ఆ ఎద్దును మహిమాన్వితంగా భావిస్తూ గ్రామస్తులు పూజించేవారు. ఈ క్రమంలోనే ఎద్దు మృతి చెందిన తర్వాత పొలం పక్కనే ఖననం చేసి సమాధి నిర్మించి, దానిపై నంది విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అప్పటి నుంచి ఇప్పటి వరకూ పూజలు చేస్తూ వస్తున్నారు. శ్రీరామ నవమి రోజు గుంతకల్లు మండలంలోని ఆమీన్‌పల్లి గ్రామస్తులందరూ అక్కడకు చేరుకుని వంటవార్పు చేపట్టి బసవేశ్వరుడికి నైవేద్యం సమర్పించి భోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సమాధిపై ఉన్న నంది విగ్రహాన్ని దుండగులు పెకలించుకుని వెళ్లడంతో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. ఘటనపై కసాపురం పోలీసులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

అన్నదాత ఆక్రందన

- గార్లదిన్నె మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు తన బోరు బావికి కరెంటు లైన్ వేయాలంటూ ఇటీవల ఏఈని సంప్రదించారు. అయితే, లైన్ మంజూరు చేయాలంటే రూ.50 వేలు అందజేయాల్సి ఉంటుందని, లేదంటే ఎస్టిమేషన్ ఎక్కువగా వేస్తామని ఏఈ స్పష్టం చేశారు. దీంతో రైతు మరో దారి లేక ఆమేర డబ్బు ఇచ్చి లైను లాగించుకున్నారు.

- తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం యాడికి మండలానికి చెందిన ఓ రైతు ఆరు నెలల క్రితం విద్యుత్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. స్టాకు లేదని చెబుతున్నారని రైతు వాపోయారు. వీరే కాదు.. జిల్లాలోని వేల మందిది ఇదే దుస్థితి.



- వేల సంఖ్యలో కొత్త వ్యవసాయ కనెక్షన్ల పెండింగ్
- నీళ్లున్నా కరెంటు లేక రైతుల విలవిల
- డీపీలు, విద్యుత్ లైను వైర్లు లేవని చెబుతున్న అధికారులు
- డీపీ మంజూరుకు రూ.50 వేలు అడుగుతున్నారంటున్న అన్నదాతలు
- వ్యవసాయాధారిత జిల్లాలో దారుణంగా రైతుల పరిస్థితి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'రైతులందరూ మీ పొలాల్లో మీరే కరెంటు ఉత్పత్తి చేసుకోవచ్చు. మీరు వాడుకోగా మిగిలింది ప్రభుత్వానికి ఇచ్చేలా చేస్తాం. కరెంటు చార్జీలు పెరగవు. రైతులే సంపద సృష్టించేలా తీర్చిదిద్దుతాం' అంటూ ఎన్నికలముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ఒట్టి మాటగానే మిగిలిపోయింది. కూటమి సర్కారు అలసత్వం కారణంగా ఉమ్మడి అనంత పురం జిల్లాలో మళ్లీ కరెంటు కష్టాలు మొదలయ్యాయి. పంటలు పెట్టుకుందామనే గంపెడాశతో కొత్తగా బోర్లు వేసుకుని విద్యుత్ కనెక్షన్ కోసం అధికారుల వద్దకు వెళ్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. దీనికితోడు ఏఈలు లంచాలు అడుగుతుండటంతో వారి ఆక్రందన వర్ణనాతీతంగా ఉంటోంది. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, వైర్లు లేవని చెబుతుండటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 15 వేల వరకూ పెండింగ్‌లో ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే రబీ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులు... బోర్లకింద అయినా పంటలు వేసుకుని బాగుపడదామనుకుంటే వారి ఆశలపై సర్కారు నీళ్ల చల్లుతోంది. కాగా.. గత ప్రభుత్వంలో కరెంటు కష్టాలు ఉండేవి కాదని, వ్యవసాయ కనెక్షన్లు సులభంగా ఇచ్చేవారని రైతులు చెబుతున్నారు. నూతన ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో నాణ్యమైన విద్యుత్ అందించారని, ఇప్పుడు పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయని అంటున్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో కరెంటు కోతలు..

శ్రీ సత్యసాయి జిల్లాలో జనవరి కూడా దాటకముందే కరెంటు కష్టాలు మొదలయ్యాయి. పూర్తిగా బోరుబావుల కిందే పంటలు పండించుకునే రైతన్నలు కరెంటు కోతలతో అల్లాడిపోతున్నారు. ధర్మవరం, పుట్టపర్తి, మడకశిర ప్రాంతాల్లో విద్యుత్ కార్యాలయాల ఎదుట రైతులు ధర్నాకు దిగుతున్న పరిస్థితి.

స్పందించని ఎస్ఈ..

కూటమి సర్కారు ఏర్పడగానే ఎస్ఈగా సంపత్ కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు సంతకాలు చేసి మరీ ఆయన్ను తీసుకొచ్చారు. ఇంత వరకూ బాగానే ఉన్నా విద్యుత్ సమస్యలపై కలవడానికి వెళితే కనీసం స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. ఫోన్ చేస్తే కూడా స్పందన లేదని చెబుతున్నారు. మీడియా ప్రతినిధులు ఫోన్ చేసినా ఎస్ఈ స్పందించకపోవడం గమనార్హం.

2019-2024 మధ్య కాలంలో విద్యుత్ సంస్కరణలు ఇలా..

కేటగిరీ	సంఖ్య	వ్యయం
వ్యవసాయ కనెక్షన్లు	94,060	--
ట్రాన్స్‌ఫార్మర్లు	9,612	రూ.270.82 కోట్లు
సబ్‌స్టేషన్లు	46	రూ.161 కోట్లు
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	114	రూ.53.76 కోట్లు
33వీ ఫీడర్లు	11	రూ.40.26 కోట్లు
11కేవీ ఫీడర్లు	19	రూ.13.93 కోట్లు
33కేవీ లైను	42.4 కి.మీ	రూ.98.83 కోట్లు
హౌసింగ్ కాలనీలు	349	రూ.88.32 కోట్లు
11 కేవీ ఫీడర్లు	593	రూ.1334.23 కోట్లు
33కేవీ కొత్త ఫీడర్లు	579.5 కిమీ	రూ.50.6 కోట్లు
కొత్త సబ్‌స్టేషన్ల ప్రతిపాదన	273	రూ.955.5 కోట్లు

విద్యుత్ చార్జీల భారం..

కూటమి సర్కారు వచ్చాక విద్యుత్ చార్జీలు భారీగా పెరగడంతో సామాన్యులు విలవిలలాడిపోతున్నారు. అనంతపురం నగరంలోని అశోక్ నగర్‌కు చెందిన అల్లాబకష్ ఇంటికి నవంబర్‌లో రూ.560 కరెంటు బిల్లు రాగా, డిసెంబర్‌లో ఏకంగా రూ.1,300 వచ్చింది. దీంతో హతాశుడైన అల్లాబకష్ ఇదేమని విద్యుత్ అధికారులను అడిగితే కరెంటు చార్జీలు పెరగవా.. ఎప్పుడూ అలాగే ఉంటాయా అంటూ అవహేళన చేసినట్లు తెలిసింది. ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగి సతమతమవుతుంటే.. చార్జీల రూపంలో తన లాంటి మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరిచారని అల్లాబకష్ వాపోయారు.

అదిగో ఇదిగో అంటున్నారు



విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసి 10 నెలలు అవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ అదిగో వస్తుంది, ఇదిగో వస్తుందంటున్నారు. మెటీరియల్ రాలేదని చెబుతున్నారు. చేసేది లేక పక్క రైతు పొలంలోని కనెక్షన్ తీసుకుని వరి పంట సాగు చేశా.
–సత్యనారాయణ, ఇల్లూరు, గార్లదిన్నె మండలం

గీత కార్మికులకు 14 మద్యం షాపులు

- 5 వరకూ దరఖాస్తులకు అవకాశం
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి

అనంతపురం: గీత కార్మికులకు జిల్లాలో 14 మద్యం షాపులను కేటాయించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. రామ్మోహన్ రెడ్డి తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతుల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈడిగ-9, గౌడ్ -2, గౌడ-1, గొండ్ల-1, కళాలి -1 ఉప సామాజిక వర్గానికి షాపులు కేటాయిస్తామన్నారు. రూ.2 లక్షలు (నాన్ రీఫండబుల్) చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందని చెప్పారు. దరఖాస్తుదారులు జిల్లా వాసులై ఉండాలన్నారు. అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్, గుంతకల్లు మునిసిపాలిటీ పరిధిలోని షాపులకు గౌడ, రాయదుర్గం రూరల్ షాపు-గౌడ, డీ హీరేహాళ్ మండలంలో గొండ్ల, తాడిపత్రి మునిసిపాలిటీలో కళాలి, గుంతకల్లు, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గం మునిసిపాలిటీ, కంబదూరు, గుమ్మఘట్ట, గుంతకల్లు రూరల్, బెళుగుప్ప, రాప్తాడు మండలాల్లో ఈడిగ ఉప కులం కేటగిరీ వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 7న కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో షాపులు కేటాయిస్తారని వెల్లడించారు.

హాకీ టోర్నీ ప్రారంభం



అనంతపురం: అనంతపురం స్పోర్ట్స్ విలేజ్ (ఆర్డీటీ స్టేడియం)లో సోమవారం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ మెమోరియల్ 13వ రాష్ట్ర సబ్ జూనియర్ ఉమెన్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజ్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు విజయబాబు, సెక్రటరీ ఎస్.అనిల్ కుమార్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ టోర్నీని ప్రారంభించారు. మొదటి రోజు మ్యాచుల్లో నంద్యాల జట్టుపై చిత్తూరు, నెల్లూరుపై అన్నమయ్య, కర్నూలుపై తిరుపతి జట్లు విజయం సాధించాయి.

కిటకిటలాడిన కలెక్టరేట్



ఈ దివ్యాంగురాలి పేరు గంగరత్నమ్మ. ఈమెది ధర్మవరం మండలం రావులచెరువు గ్రామం. 90 శాతం వైకల్యం ఉండడంతో రూ.15 వేల పింఛనుకు అర్హత పొందింది. మెడికల్ బోర్డు సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. రూ.15 వేల పింఛను మంజూరైనట్లు అధికారులు చెప్పారని, అయితే డబ్బు మాత్రం ఇవ్వడం లేదని కలెక్టర్ వినోద్‌కుమార్ ఎదుట గంగరత్నమ్మ వాపోయింది.



ఈమె పేరు రత్నకుమారి. గుత్తి ఆర్ఎస్ మంచాలనగర్‌లో నివాసముంటోంది. ఈమె కుమార్తె లిఖిత మానసిక వికలాంగురాలు. నాలుగు నెలల క్రితం వరకు పింఛను వచ్చేది. అయితే నకిలీ సదరం సర్టిఫికెట్ అంటూ ఇటీవల తొలగించారు. పిల్లలు మానసిక వికలాంగురాళ్లంటూ భర్త తనను వదిలేసి వెళ్లాడని, తన బిడ్డకు పింఛను పునరుద్ధరించి ఆదుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కన్నీళ్లతో రత్నకుమారి వేడుకుంది.

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు వినతుల వెల్లువ
- పింఛన్లు తొలగించారంటూ దివ్యాంగుల ఆవేదన
- పరిష్కారం చూపాలంటూ దీనంగా వేడుకోలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: అర్జీదారులతో కలెక్టరేట్ కిటకిటలాడింది.తమ మొర విని కష్టాలు తీర్చాలంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను ప్రజలు వేడుకున్నారు. కళ్ల ముందే వికలత్వం కనిపిస్తున్నా లేని పోని కారణాలతో తమ పింఛన్లు తొలగించారంటూ పలువురు దివ్యాంగులు ఆవేదన చెందారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పేనాయక్, శిరీష, మల్లికార్జున, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి వినతులు స్వీకరించారు. మొత్తం 520 అర్జీలు అందాయి. వ్యయ ప్రయాసలకోర్చి వచ్చామని, సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు వేడుకున్నారు. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపించడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని...

- అధికారులు, సర్పంచ్ చుట్టూ తిరిగినా తన ఇంటికి కొళాయి కనెక్షన్ ఇవ్వలేదంటూ తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ వాపోయాడు. కొళాయి కనెక్షన్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరాడు.
- భూ సేకరణ కింద రోడ్డు నిర్మాణానికి తన భూమి తీసుకున్నప్పటికీ పరిహారం ఇవ్వలేదని తాడిపత్రి మండలం గన్నేవారిపల్లెకు చెందిన పుల్లయ్య ఫిర్యాదు చేశాడు. జాతీయ రహదారి 544 డీ నిర్మాణం కోసం తన 1.19 ఎకరాల భూమిని తీసుకున్నారని, అయితే పరిహారం జమ చేయలేదని చెప్పాడు. తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

విద్యార్థి మృతి మంత్రి లోకేష్‌కు పట్టదా?



నారాయణ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: అనంతపురంలోని నారాయణ కళాశాలలో విద్యార్థి మరణించి నాలుగు రోజులవుతున్నా విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు పట్టదా అని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అని ప్రశ్నించారు. చరణ్ మృతికి కారణమైన నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థి మృతి ఘటనపై మంత్రి లోకేష్ మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. మంత్రి నారాయణ కళాశాల కావడంతోనే మౌనం పాటిస్తున్నారని దుయ్యబట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేసి నాలుగు రోజులైనా కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. విద్యా సంస్థల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తూ మానసిక క్షోభకు గురి చేస్తున్నాయన్నారు. మంత్రి నారాయణకు చెందిన విద్యాసంస్థ కావడంతో చర్యలకు అధికారులు భయపడుతున్నారన్నారు. నారాయణను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి నరేష్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పృథ్వి, బీసీ,ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్‌యాదవ్, నిరుద్యోగ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి వినోద్‌కుమార్, ఏఐడీఎస్ఓ నాయకులు మహేశ్, విద్యార్థి సంఘ నాయకులు చందు, వంశీ, గిరి, సాయి, సిద్దు పాల్గొన్నారు.

- విద్యార్థి మృతిపై ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ, ఏపీఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఏ నాయకులు కూడా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నారాయణను మంత్రి వర్గం నుంచి తొలగించడంతో పాటు బాధిత విద్యార్థి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరుతూ కలెక్టర్‌కు నాయకులు వీరేంద్ర, శంకర్, వేమన, ఓబుళేసు, శివ వినతిపత్రం అందజేశారు.

ఆత్మహత్యనూ మాకు అంటకడతారా?

- నిరాధార ఆరోపణలు చేసిన పరిటాల శ్రీరామ్‌పై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: వ్యక్తిగత ఇబ్బందులతో మహేశ్వర రెడ్డి బలవన్మరణానికి పాల్పడితే.. దాన్ని కూడా తమ కుటుంబానికి అంటకడతారా? అంటూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం అనంతపురం నగర శివారులోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సోములదొడ్డి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న తిమ్మిరెడ్డి మహేశ్వరరెడ్డి మృతిపై లోతుగా, నిష్పక్షపాతంగా విచారణ చేయించి వాస్తవాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. మహేశ్వరరెడ్డి తమకు దూరపు బంధువు అవుతాడని, అతని తండ్రి మలిరెడ్డి 30 ఏళ్లుగా తమ చిన్నాన్న, తన సోదరుడికి ముఖ్య అనుచరుడిగా ఉన్నాడన్నారు. గతంలో పరిటాల సునీత కాన్వాయ్‌పై చెప్పులేసిన కేసు, పరిటాల శ్రీరామ్ వాహనాలపై రాళ్లదాడి కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్నాడన్నారు. మంచి మార్గంలో నడవాలని మహేశ్వరరెడ్డికి తన సోదరుడు చెప్పేవాడన్నారు. పోలీసులు ఇప్పటికే అతని మొబైల్ సీజ్ చేశారని, ఎవరెవరికి ఫోన్లు చేశాడు, ఎలాంటి స్టేటస్‌లు పెట్టాడు, ఫేస్‌బుక్‌లో ఏం మెసేజ్‌లు పెట్టాడో విచారణ చేయాలని కోరారు. ఎవరైనా రైలు కింద పడ్డారని డ్రైవరు గుర్తిస్తే తర్వాత స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని, మరి ఆ విధంగా ఇచ్చారా లేదా విచారించాలన్నారు. 'ఇక్కడ ఉన్నా' అని తమ వాడు రాత్రి మెసేజ్ పెట్టాడంటూ 16-17 ఏళ్ల వయసున్న యువకుడు ఉదయాన్నే బైకుపై వెళ్లి ట్రాక్ పరిశీలించే కీ మెన్‌ను అడగ్గా.. అక్కడ శవముందని చెప్పాడని అంటున్నారని, వీరి స్టేట్‌మెంట్లు కూడా రికార్డ్ చేయాలన్నారు. సోములదొడ్డిలో ప్రైవేట్, ప్రభుత్వ సీసీ కెమెరాలున్నాయని, ఫుటేజీలను పరిశీలించి విచారణ చేయాలని కోరారు. రాత్రి పెద్దశబ్ధం వచ్చిందని చెబుతున్న తోటవాళ్లనూ విచారించాలన్నారు. అప్పటికీ అనుమానం తీరకపోతే సీబీఐ విచారణకు ఆదేశించాలని సూచించారు. నిరాధార ఆరోపణలు చేసిన పరిటాల శ్రీరామ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

దుష్ప్రచారంతోనే వారికి ఉనికి..

తోపుదుర్తి సోదరులపై దుష్ప్రచారం చేయకపోతే పరిటాల కుటుంబానికి రాజకీయ ఉనికి ఉండదని ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలవుతున్నా తమ కుటుంబంపై ఎల్లో మీడియా కూడా దుష్ప్రచారం చేస్తూనే ఉందన్నారు. 'మీ నాయన ఫ్యాక్షన్ చూశాడు. మద్దెలచెరువు, కనుముక్కల వాళ్లు ఫ్యాక్షన్ చూశారు. వారంతా సాధించారు.. అందరూ పోయారు. తరం మారింది.. టెక్నాలజీ పెరిగింది. మా గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేస్తారు, ఎలాంటి వసతులు కల్పిస్తారు అంటూ ప్రజలు అడిగే రోజులివి. ఇలాంటి రోజుల్లోనూ మీ కహానీలు వినేందుకు, మీ పాత చరిత్రను, చెత్తకాగితాలను చదివేందుకు ఎవరూ సిద్ధంగా లేరు' అని హెచ్చరించారు.

ఫ్యాక్షన్‌కు అడ్డుకట్ట వేశాం..

తాను ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లలో రాప్తాడు నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌కు పూర్తిగా అడ్డుకట్ట వేశానని ప్రకాష్ రెడ్డి తెలిపారు. తాటిచెర్ల ఉప సర్పంచ్‌ను టీడీపీ వాళ్లే హత్య చేశారని, టమాట మండీ నడుపుతున్న బిల్లే యల్లప్పను వాళ్లే హత్య చేశారని ఆరోపించారు.యల్లప్ప హత్య తర్వాత టమాటా మండీతో లాభపడుతోంది పరిటాల కుటుంబమే అని పేర్కొన్నారు. టమాట మండీల ద్వారా ఏడాదికి రూ.7 కోట్లు నేరుగా పరిటాల ట్రస్ట్‌కు వెళ్తోందని చెప్పారు. 8 నెలల్లో దౌర్జన్యాలకు కేరాఫ్‌గా రాప్తాడు నియోజకవర్గాన్ని మార్చారని, వీటిపై ప్రశ్నిస్తున్నందుకు తమతో పాటు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు.

క్లుప్తంగా

టీడీపీ నేత దౌర్జన్యం



ఆక్రమిత స్థలంలో బండలు పాతిన దృశ్యం

గుమ్మఘట్ట: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అందజేసిన నివేశన స్థలాన్ని స్థానిక టీడీపీ నేత కబ్జా చేసి బండలు పాతారు. ఈ ఘటన గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు.. పూలకుంట గ్రామ శివారులోని సర్వే నంబర్ 73–3లో 110 మంది నిరుపేదలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నివేశనా స్థలాలను మంజూరు చేసింది. ఈ క్రమంలో వడ్డె తిమ్మారెడ్డి భార్య అంజినమ్మకూ అప్పట్లోనే ప్రభుత్వం పట్టా కూడా ఇచ్చింది. అయితే ఆర్థిక స్థోమత లేని కారణంగా పక్కా గృహ నిర్మాణం చేపట్టలేకపోయారు. తాజాగా అంజినమ్మకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని స్థానిక ఓ టీడీపీ నేత కబ్జా చేసి బండలు పాతాడు. ఇదేమని ప్రశ్నిస్తే మహిళ అని కూడా చూడకుండా దౌర్జన్యానికి దిగాడు. విషయాన్ని రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని బాధితురాలు వాపోతోంది. ఇదే అంశంపై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా... వీఆర్వోను విచారణకు ఆదేశించామని, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

పీఈటీలకు శాశ్వత స్థానాలు చూపించండి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న పీఈటీ అసోసియేషన్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఏళ్ల తరబడి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టుల్లో అగైనెస్ట్‌గా పనిచేస్తున్న పీఈటీలకు శాశ్వత స్థానాలు చూపించాలని పీఈటీ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... జీఓ 117 ప్రత్యామ్నాయ మార్గదర్శకాల్లో భాగంగా ప్రతి ఉన్నత పాఠశాలలోనూ ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్) పోస్టు చూపిస్తున్నారన్నారు. ఈ పోస్టుల్లో నేటికీ జిల్లా వ్యాప్తంగా 50 మంది పీఈటీలు అగైనెస్ట్‌గా పని చేస్తున్నారన్నారు. కొత్తగా తీసుకొస్తున్న పంచాయతీ మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో పీఈటీ పోస్టును కేడర్ స్ట్రెంత్‌లో చూపించి సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే 300 మందికి పైబడి విద్యార్థులున్న ఉన్నత పాఠశాలలకు అదనంగా ఎస్‌ఏ (ఫిజికల్‌ఎడ్యుకేషన్) పోస్టు ఇచ్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. డీఈఓను కలిసిన వారిలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవమూర్తి, ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు ప్రభాకర్, నరసింహారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస రెడ్డి, బయపరెడ్డి, అంజనేయులు ఉన్నారు.

శింగనమలకు దారి కష్టాలు

- జాతీయ రహదారి ఏర్పాటుతో ప్రధాన మార్గం మూసివేత
- గతంలో గ్రామస్తుల ధర్నాతో ప్లాన్‌లో మార్పు
- మభ్య పెట్టి పని చక్కపెట్టిన ఎన్‌హెచ్‌ఏ అధికారులు

శింగనమల: కూటమి సర్కార్ వల్లెవేస్తున్న అమరావతి అభివృద్ధి మంత్రం ధాటికి శింగమల నియోజకవర్గ అభివృద్ధి బలైంది. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా నాలుగు లైన్ల మార్గంతో జాతీయ రహదారి 544డీ పనులు సాగుతున్నాయి. అయితే ఈ పనులతో నియోజకవర్గ కేంద్రమైన శింగనమలకు రాకపోకలు సాగించే ఏకైక ప్రధాన రహదారి పూర్తిగా బంద్ అయ్యింది.

ప్లాన్‌ను మార్చినా...

జాతీయ రహదారి 544డీ నిర్మాణంలో భాగంగా శింగనమల చెరువు మరువకొమ్మ వద్ద ఉన్న కొండను తొలిచారు. అదే సమయంలో మరువకొమ్మ వద్ద ఉన్న పాత రహదారిని నిర్లక్ష్యం చేశారు. నియోజకవర్గ కేంద్రమైన శింగనమలకు ప్రధాన రహదారి కాస్త తెరమరుగవుతుండడంతో స్థానికులు నేరుగా అధికారులను కలసి చర్చించారు. నియోజకవర్గ కేంద్రానికి సులువుగా రాకపోకలు సాగించేలా జాతీయ రహదారిపై నుంచి కాకుండా అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే బాగుంటుందని విన్నవించారు. దీనిపై స్పందించిన అధికారులు ప్లాన్‌లో మార్పు చేశారు. అయితే ఈ ప్లాన్‌ను నేషనల్ హైవే అథారిటీ అధికారులు తుంగలో తొక్కి తాము ముందుగా నిర్ణయించుకున్న మేరకే రహదారి పనులు చక్కపెట్టేశారు.

చెప్పింది ఒకటి.. చేసింది మరొకటి!

జాతీయ రహదారి 544డీ పక్కనున్న శింగనమల నియోజకవర్గ పరిధిలోని నీలారెడ్డిపల్లి, కొర్రపాడు, సి.బండమీదపల్లి, పోతురాజు కాలువ, పెరవలి, నాయనపల్లి క్రాస్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయడంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణతో పాటు ప్రజల రాకపోకలకు మార్గం సుగమమైంది. అయితే నియోజకవర్గ కేంద్రం శింగనమల విషయంలో అధికారులు పూర్తిగా మొండి వైఖరి అవలంబించడంతో గ్రామస్తులు, యువకులు గతంలో రోడ్డెక్కారు. పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. దీంతో స్పందించిన అధికారులు అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయలేమని, అయితే రోడ్డు నిర్మాణం పూర్తికాగానే అటు అనంతపురానికి, ఇటు తాడిపత్రి వైపుగా రాకపోకలు సాగించేలా లెవల్ క్రాసింగ్ ఏర్పాటు చేస్తామని భరోసానిచ్చారు. ఇందుకు సంబంధించిన ప్లాన్‌ను కూడా గ్రామస్తులకు చూపించారు. చివరకు నియోజకవర్గ కేంద్ర ప్రజలను మభ్య పెట్టి లెవల్ క్రాసింగ్ లేకుండా బారికేడ్లను ఏర్పాటు చేసేశారు. దీంతో శింగనమలకు దారి లేకుండా పోయింది.

అభివృద్ధికి గండి

జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టినప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ప్రజా ప్రతినిధులు ఏనాడూ స్పందించలేదని శింగనమల వాసులు మండిపడుతున్నారు. చివరకు గ్రామస్తులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్నా సమయంలో శింగనమలకు రాకపోకలు సాగించేలా రెండు వైపులా లెవల్ క్రాసింగ్‌లు ఏర్పాటు చేస్తామని అధికారుల సమక్షంలోనే ఎన్‌హెచ్‌ఏ అధికారులు స్పష్టమైన హామీనిచ్చారని, అయితే క్షేత్రస్థాయిలో హామీ అమలులో ఎన్‌హెచ్‌ఏ అధికారులు విఫలమయ్యారని మండిపడుతున్నారు. లెవల్ క్రాసింగ్ లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి నియోజకవర్గ కేంద్ర అభివృద్ధికి గండి కొట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఈ రోడ్డు అనంతపురం నుంచి తాడిపత్రి వైపుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి 544-డీ. రాజధాని అమరావతికి ఎక్స్‌ప్రెస్ హైవేగా గుర్తింపు . ఇక్కడ వరకూ అంతా బాగున్నా... రహదారి ఏర్పాటులో భాగంగా శింగనమలకు వెళ్లే ప్రధాన రోడ్డును మరువకొమ్మ క్రాసింగ్ వద్ద మూసేసి, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో శింగనమల నుంచి అనంతపురానికి వెళ్లాలనుకునే వారు ప్రమాదకర స్థితిలో వాహనాలకు ఎదురుగా ప్రయాణించాల్సి వస్తోంది. అంతేకాక తాడిపత్రి వైపు నుంచి శింగనమలకు చేరుకునే ప్రధాన రహదారి పూర్తిగా బంద్ కావడంతో అభివృద్ధిపై బండ పడినట్లైంది.

బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిందే



ఇదే మార్గంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు అండర్ పాస్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. అదే విధంగానే నియోజకవర్గ కేంద్రానికి రాకపోకలు సాగించేలా అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి. లేకపోతే జాతీయ రహదారిపై శింగనమల మరువకొమ్మ క్రాస్ వద్ద ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేసి గ్రామస్తుల ప్రాణాలకు భద్రత కల్పించాలి. ఆ దిశగా ప్రజాప్రతినిధులూ చొరవ తీసుకోవాలి.

– భాస్కరరెడ్డి, ఆటో డ్రైవరు, శింగనమల

పూర్తిగా మభ్య పెట్టారు



అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని యువకులతో కలసి గతంలో జాతీయ రహదారిపై ధర్నా చేశాం. అయితే ఆ సమయంలో అండర్ పాస్ బ్రిడ్జి కాకుండా లెవల్ క్రాసింగ్ ఏర్పాటు చేస్తామని అధికారుల సమక్షంలోనే జాతీయ రహదారుల అధికారులు హామీనిచ్చారు. ఇందుకు సంబంధించి మార్పు చేసిన ప్లాన్ కూడా చూపించారు. అయితే ఇప్పుడేమో ఆ ప్లాన్‌ను చెత్తబుట్టలో వేసి కనీసం లెవల్ క్రాసింగ్ కూడా లేకుండా చేస్తున్నారు. మొత్తం గ్రామస్తులనే మభ్య పెట్టి నియోజకవర్గ కేంద్ర అభివృద్ధిని అడ్డుకోవడం చాలా దుర్మార్గం. శింగనమలకు రాకపోకలు సాగించే ప్రజల ప్రాణాలకు భద్రత ఉండేలా అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేసే వరకూ పోరాటాలు సాగిస్తాం.

– రాంచరణ్‌యాదవ్, శింగనమల

మృతురాలి ఆచూకీ లభ్యం

పామిడి: స్థానిక ఎద్దులపల్లి రోడ్డులోని పాత రైల్వే స్టేషన్ (మీటర్ గేజ్) వద్ద ఆదివారం సాయంత్రం రైలు ఢీకొని మృతిచెందిన మహిళ ఆచూకీని రైల్వే పోలీసులు గుర్తించారు. వివరాలు... పామిడి మండలం కట్టకిందపల్లికి చెందిన గోవిందు భార్య రామాంజినమ్మ (50) కొంత కాలంగా క్షయ వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలో వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె... ఆదివారం సాయంత్రం పాత రైల్వేస్టేషన్ సమీపంలోని పెద్దమ్మ గుడి వద్ద పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై తొలుత గుర్తుతెలియని వృద్ధురాలి మృతి కింద కేసు నమోదు చేసిన అనంతపురం రైల్వే పోలీసులు దర్యాప్తులో మృతురాలిని రామాంజినమ్మగా నిర్ధారించారు. ఆమెకు భర్తతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జవాబుదారీతనంతో వ్యవహరించండి : ఎస్పీ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ప్రజలు అందజేసే వినతులపై జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ సత్వర పరిష్కారం చూపాలని సిబ్బందిని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్య పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 80 వినతులు అందాయి. వినతులను ఎస్పీ స్వయంగా స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, మహిళా డీఎస్పీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువ వెడల్పు పనులు చేపట్టాలి



హంద్రీనీవా సీఈ నాగరాజుకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం సెంట్రల్: హంద్రీ–నీవా కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 10వేల క్యూసెక్కులకు పెంచేలా తక్షణమే పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా సోమవారం అనంతపురంలోని హంద్రీ–నీవా కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కరువు పీడిత ప్రాంతంగా ఉన్న రాయలసీమకు నికర జలాలు తీసుకురావడానికి అనేక ప్రతిపాదనలు చేసినట్లు గుర్తు చేశారు. 1972లో జాతీయ ఇరిగేషన్ కమిషన్, 2004లో జయతి ఘోష్ కమిషన్, 2009లో స్వామినాథన్ ఫౌండేషన్, 2012లో న్యూఢిల్లీ కమిటీల నివేదికతో పాటు శ్రీకృష్ణ కమిషన్ నివేదిక ఈ ప్రాంతాల అభివృద్ధికి సాగునీటి అవసరాన్ని, అందుకు ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేశాయన్నారు. అయితే ఇప్పటి వరకూ ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. హంద్రీ–నీవా ద్వారా ఉమ్మడి జిల్లాలోని 3.45 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉందని, అయితే ప్రస్తుత కాలవ సామర్థ్యం అందుకు తగినంతగా లేదన్నారు. 2019లో పామిడిలో జరిగిన బహిరంగసభలో సీఎం హోదాలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. హంద్రీ–నీవాను 10వేల క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించారని గుర్తుచేశారు. ఈ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ హంద్రీ–నీవా సీఈ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామిరెడ్డి, చంద్రశేఖర్, బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, రామాంజనేయులు, ముత్తూజ, రైతు సంఘం నాయకులు శివారెడ్డి, వలి, ప్రకాష్‌రెడ్డి, కుళ్లాయప్ప, చెన్నారెడ్డి, పోతులయ్య, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భర్తే కాలయముడా?

- 14 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం
- ఇటీవల భార్యపై అనుమానం
- హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం!
- పోలీసుల అదుపులో అనుమానితుడు





మీనాక్షి (ఫైల్), అనుమానితుడు జయప్రకాష్

యల్లనూరు: ప్రేమించుకున్నారు.... కాదన్న పెద్దలనూ ఒప్పించారు. అందరి సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. పండంటి కాపురానికి చిహ్నంగా ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే ఏమి జరిగిందో.. ఏమో... చిన్నపాటి అనుమానం పెనుభూతమైంది. 14 ఏళ్ల వివాహ బంధం అపహాస్యమై... చివరకు భార్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. యల్లనూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన మాజీ డీలర్ సూర్యనారాయణ నాల్గో కుమార్తె మీనాక్షి (34), అదే గ్రామానికి చెందిన జయప్రకాష్ 14 ఏళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెళ్లి సమయంలో ఓ బ్యాటరీ కంపెనీలో పనిచేసే జయప్రకాష్... పదేళ్ల క్రితం తన ఉద్యోగం మానేసి స్వగ్రామానికి చేరుకుని వ్యవసాయ పనులతో కుటుంబాన్ని పోషించుకోసాగాడు.

సార్... నా భార్య ఆత్మహత్య చేసుకుంది!

ఆదివారం అర్ధరాత్రి యల్లనూరు పీఎస్‌కు జయప్రకాష్ చేరుకుని 'సార్.. నా భార్య ఆత్మహత్య చేసుకుంది' అంటూ డ్యూటీలో ఉన్న సిబ్బందికి సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న సీఐ సత్యబాబు, పుట్లూరు పీఎస్ ఎస్ఐ వెంకటనరసింహులు ఘటనపై జయప్రకాష్‌తో ఆరా తీశారు. తనకేమీ తెలియదని అర్ధనగ్నంగా ఇంట్లో పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని జయప్రకాష్ తెలపడంతో పోలీసులు శింగవరం గ్రామానికి చేరుకుని పరిశీలించారు.

అనుమానాలన్నీ అయినవాడిపైనే

మీనాక్షి ఆత్మహత్య ఉదంతం ఒక్కసారిగా గుప్పుమనడంతో శింగవరం గ్రామం ఉలిక్కిపడింది. అయితే ఆమె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, భర్తనే హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించి ఉంటాడనే వదంతులు వ్యాపించాయి. దీనికి తోడు మీనాక్షి తల్లి లక్షుమమ్మ సైతం తన కుమార్తె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెంటనే జయప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని, అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, కొంత కాలంగా మీనాక్షి ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న జయప్రకాష్ ఎలాగైనా ఆమెను వదిలించుకోవాలనే పథకం ప్రకారం తన అన్న శివశంకర్‌తో కలసి హతమార్చి అనంతరం తనపై ఎలాంటి అనుమానాలు రాకుండా మీనాక్షి మృతదేహాన్ని అర్ధనగ్నంగా చేసి ఉరి వేసి అందరి దృష్టి ఏమార్చే ప్రయత్నం చేశారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనికి తోడు జయప్రకాష్ అన్న శివశంకర్ అజ్ఞాతంలోకి వెళ్లడంతో అనుమానాలకు ఊతమిచ్చినట్లైంది. ఘటనపై వాస్తవాలు నిగ్గు తేల్చే దిశగా పోలీసుల విచారణ కొనసాగుతోంది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

అడ్మిషన్స్

■ On-Line చేసుకున్న స్టూడెంట్స్‌కి B.Sc (MLT), BPT (ఫిజియోథెరపీ)కి గవర్నమెంట్ సీట్స్ కలవు. On-Line చేయని స్టూడెంట్స్‌కి Management సీట్స్ కలవు. Cont: G.MURALI - 9030661651 – అనంతపురం. [A-1494]

REAL ESTATE

ఇల్లు అమ్మబడును

■ ATP టౌను తపోవనం సర్కిల్ రామాలయం దగ్గర, సోమనాథనగర్ నందు దక్షిణం ఫేసుగల ఇల్లు అమ్మబడును. సంప్ర॥ సెల్: 9959567227. [A-641]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6650]

WANTED

■ శ్రీబాలాజీ హోంకేర్ :- Hyd లో పెద్ద వారికి సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు॥ కావలెను.జీ: 18000 రూం+మీల్స్ ఫ్రీ. ✆ 95731 83331 [G-1928]

■ Manna ఆగ్రో ఫుడ్స్ నందు జిల్లా అంతటా పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 16,000– 18,000. Q: ఇంటర్/డిగ్రీ. సెల్: 9182112429 [A-1497]

■ అనంతపురం, రుద్రంపేటలో గ్యారేజ్ వర్క్ షాప్ లో పనిచేయుటకు హెల్పర్స్ అర్జెంటుగా కావలెను. సెల్: 9063621757. [SCA25001415]

■ హోండా కార్ షోరూమ్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, HR, Receptionist, SQM, Tele Callers, కావలెను. Phone number: 9100056555. [A-762488]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ BELL INFRA ప్రాజెక్ట్ నందు పనిచేయుటకు సీనియర్ మార్కెటింగ్ మేనేజర్లు (M / FM) కావలెను. టీమ్ తో వచ్చిన వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వబడును. సెల్ : 9989452444. [A-1498]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256047]

■ ఇంటిపని, బేబీకేర్, పేషెంట్ కేర్, (M/F) జీ: 15k-25k, 24గం, ప్రతి నెలా 2 సెలవులు, భో.వసతి, లోన్, బోనస్ ఫ్రీ ఫోన్: 9160002192/ 9160002193 [SCA25001365]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ॥ 270/-

అదనపు లైను రూ॥ 60/-

ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307

DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726

HINDUPUR & MADAKASIRA : 9912220723, 9705346587

GUNTAKAL & TADIPATRI : 9912220722

KADIRI : 9010593486

RAYADURG : 9010470185

హంద్రీ-నీవా కాలువలో మృతదేహం

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు వద్ద ఉన్న హంద్రీ–నీవా లిఫ్ట్ వద్ద సోమవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. కాలువలో కొట్టుకువచ్చిన మృతదేహాన్ని గుర్తించిన సిబ్బంది సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఆచూకీ తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రూ.60 లక్షల డ్వాక్రా సొమ్ము స్వాహా

పామిడి: మండలంలోని పి.కొండాపురంలో 32 మహిళా సంఘాల సభ్యులకు సంబంధించిన రూ.60 లక్షల పొదుపు సొమ్ము స్వాహా అయింది. వివరాలను బాధిత సభ్యులు సోమవారం వెల్లడించారు. మెప్మా సీఓగా చంద్రశేఖర్ ఉన్న సమయంలో ఆ మ మహిళా సంఘాల ఆర్‌పీగా నాగవేణి. సంఘాల బుక్‌కీపర్‌గా ఆమె భర్త భర్త ఓబులేసు వ్యవహరించారు. ఈ క్రమంలో సంఘంలోని సభ్యులు నిరక్షరాస్యతను తమకు అనుకూలంగా మార్చుకున్న వారు తెలివిగా పొదుపు సొమ్మును కాజేస్తూ వచ్చారు. ఓ సంఘంలోని పది మంది సభ్యులకు రూ.15 లక్షల రుణం మంజూరు కాగా, ఆ సంఘంలోని సభ్యులతో రెండు విత్‌డ్రా ఫారంలపై సంతకాలు తీసుకున్నారు. అనంతరం బ్యాంకు నుంచి సంఘం ఖాతాలోకి రూ.10 లక్షల రుణం మాత్రమే మంజూరైంది. ఈ మొత్తాన్ని తలా ఒక లక్ష చొప్పున సభ్యులు పంచుకున్నారు. మిగిలిన రూ.5 లక్షలను ఓబులేసు తన భార్య ఖాతాలోకి జమ అయ్యేలా చేశాడు. అనంతరం సభ్యులు ఒక్కొక్కరు నెలకు చెల్లించే రూ.5 వేల కంతును సైతం తన సొంత ఖాతాలోకి వేసుకుంటూ స్వాహా చేసినట్లుగా తెలిసింది. ఈ లెక్కన మొత్తం దాదాపు రూ.60 లక్షలు మాయం చేసినట్లు సమాచారం. ఇటీవల మహిళా సంఘం సభ్యులు బ్యాంక్‌కెళ్లి ఆరా తీసినప్పుడు మోసం బట్టబయలైంది. దీంతో ఆర్పీ నాగవేణి, ఆమె భర్త ఓబులేసుపై చర్యలు తీసుకుని తమ డబ్బు ఇప్పించాలంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత సభ్యులు తెలిపారు.

'హార్టికల్చర్ కాంక్లేవ్' బ్రోచర్లు తయారు చేయండి



అనంతపురం అర్బన్: ఈనెల 31న జరగనున్న 'అనంత హార్టికల్చర్ కాంక్లేవ్'కు సంబంధించి బ్రోచర్లు తయారు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ చెప్పారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంక్లేవ్‌లో ఉత్పత్తిదారులు, కొనుగోలుదారులు, ఎగుమతిదారులు, ప్రోగ్రెసివ్ ఫార్మర్లు, ఎఫ్‌పీఓలు, విశ్వవిద్యాలయాల నుంచి శాస్త్రవేత్తలు, అనుబంధ విభాగాల నిష్ణాతులు పాల్గొంటారన్నారు. అగ్రికల్చర్, కో–ఆపరేటివ్ స్పెషల్ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఉద్యానశాఖ డైరెక్టర్ పాల్గొంటారన్నారు. ఉద్యాన శాఖ డీడీ, ఏపీఎంఐపీ పీడీ సమష్టిగా పనిచేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదృశ్యమై..జంటగా వచ్చారు!

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతూ శనివారం అదృశ్యమైన ముగ్గురు విద్యార్థినులు సోమవారం ప్రత్యక్షమయ్యారు. ముగ్గురూ ప్రేమ వివాహాలు చేసుకుని రావడం గమనార్హం. శనివారం ఉదయం కాలేజీకి వెళ్లిన విద్యార్థినులు సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తుండగానే.. ముగ్గురు విద్యార్థినులూ ప్రేమ వివాహాలు చేసుకుని సోమవారం నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు వారిని తహసీల్దార్ నటరాజ్ వద్దకు తీసుకెళ్లారు. ముగ్గురు విద్యార్థినుల్లో ఒకరు మైనర్ కావడంతో తల్లిదండ్రులకు అప్పగించారు. మిగిలిన ఇద్దరిని కూడా తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు వారి ఇళ్లకు పంపించారు.

గిరిజన రైతుపై విద్యుత్ అధికారుల కర్కశం



సాగులో ఉన్న మిరప పంట (ఇన్‌సెట్) లక్ష్మానాయక్

కళ్యాణదుర్గం రూరల్: గిరిజన రైతుపై విద్యుత్ శాఖ అధికారుల కర్కశంగా వ్యవహరించారు. సాగుచేసిన పంటకు నీరు అందించే వీలు లేకుండా విద్యుత్ సరఫరా కాకుండా అడ్డుకుంటున్నారు. బాధిత రైతు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం లక్ష్మీపురం తండాకు చెందిన లక్ష్మానాయక్ తనకున్న నాలుగు ఎకరాల్లో మిరప, టమాట పంటలు సాగు చేశాడు. ఈ క్రమంలో రెండు బోరుబావులు ఏర్పాటు చేసుకుని విద్యుత్ సరఫరా కోసం నిబంధనల మేరకు డీడీలు చెల్లించి, సర్వీసును పొందాడు. గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నాడనే అక్కసుతో స్థానిక టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన విద్యుత్ శాఖ అధికారులు ఉన్నఫళంగా లక్ష్మానాయక్ పొలానికి ఉన్న విద్యుత్ సర్వీసు వైర్లను సోమవారం తొలగించారు. ఇదేమని ఏఈ సలీం, జూనియర్ లైన్‌మెన్ కలసి బాధిత రైతు ప్రశ్నిస్తే... బోరుబావులకు సంబంధించిన విద్యుత్ సర్వీసు లైన్ వేరే డీపీకి అనుసంధానమై ఉందని అక్కడి నుంచి లైన్ తీసుకోవాలంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. పంట చేతికొస్తున్న సమయంలో ఇలా చేయడం భావ్యం కాదని వేడుకున్నా అధికారులు కనికరించలేదు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో తనకు ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

వీసీలకు విశేషాధికారాలు

- హోదా కాలం ఐదేళ్లకు పెంచే యోచన
- మార్గదర్శకాలు జారీ చేసిన యూజీసీ



జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనం

అనంతపురం: వర్సిటీ వైస్ చాన్సలర్ (వీసీ)ల నియామకం, అర్హతలకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నూతన నిబంధనలు అమల్లోకి రానున్నాయి. తాజా నిబంధనలు అమల్లోకి వస్తే వీసీలకు విశేషాధికారాలతో పాటు వర్సిటీలపై రాష్ట్ర ప్రభుత్వ పాత్ర నామమాత్రం కానుంది. దీంతో వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీలో సభ్యుల ఎంపిక బాధ్యత పూర్తిగా గవర్నర్ విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుంది. ఇప్పటి వరకూ సెర్చ్ కమిటీలో యూజీసీ ప్రతినిధి, వర్సిటీ పాలకమండలి ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ నామినీతో కలిపి ముగ్గురు సభ్యులు ఉండేవారు. నూతన ముసాయిదా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ నామినీ ఉండరు. గవర్నర్ నామినీ ఒకరు, యూజీసీ నామినీ ఒకరు, వర్సిటీ నుంచి ఒకరు ఉంటారు. ఇప్పటి వరకూ పదేళ్ల ప్రొఫెసర్‌గా అనుభవం ఉన్నవారు మాత్రమే వీసీ పోస్టుకు అర్హులు కాగా, తాజా ముసాయిదా ప్రకారం పదేళ్ల పనిచేయాలనే నిబంధనను సడలించారు. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రొఫెసర్‌గా, మంచి పరిశోధకులుగా, పరిశ్రమల్లో మంచి అడ్మినిస్ట్రేటర్‌గా, పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో సీనియర్ స్థాయి అర్హతలు ఉన్న వారిని సైతం వీసీగా నియామకం చేయవచ్చు. అకడమిక్‌గాను మంచి రికార్డు ఉన్న వారిని వీసీగా నియమించేలా గవర్నర్ సిఫార్సు చేసే అవకాశం ఉంది. వాస్తవానికి వైస్‌చాన్సలర్ హోదా కాలం ప్రస్తుతం మూడేళ్లు కాగా, నూతన ముసాయిదా ప్రకారం వీసీగా నియామకమైనప్పటి నుంచి సదరు అధికారికి 70 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు లేదా ఐదేళ్ల పాటు కొనసాగిస్తారు. ఆ తర్వాత మరోసారి నియామకానికి అర్హులుగా పరిగణిస్తారు.

కొత్త ముసాయిదా అమల్లోకి వచ్చేలోపే వీసీల ఖరారు

యూజీసీ వీసీల నియామకానికి సంబంధించి నూతన ముసాయిదా విడుదల చేయడంతో ఇది అమల్లోకి రాకముందే రాష్ట్రంలోని వర్సిటీలకు వీసీల నియామకం చేసే దిశగా కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో ఎస్కేయూ, జేఎన్‌టీయూఏకు ఈ నెల 22వ తేదీనే సెర్చ్ కమిటీ సమావేశం పూర్తయింది. వీసీగా నియమితులయ్యే వారి పేర్లతో కూడిన జాబితా సిద్ధమైంది. దీంతో నూతన వీసీలను త్వరలో ప్రకటించే అవకాశముంది. రాష్ట్రంలోని ఐదు టాప్ వర్సిటీలకు ఐఐటీ ప్రొఫెసర్లను వీసీలుగా నియామకం చేయనున్నారు. దీంతో జేఎన్‌టీయూఏకు ఐఐటీ ప్రొఫెసర్ వీసీగా రానున్నారు. ఎస్కేయూకు అదే వర్సిటీలో పని చేస్తున్న ప్రొఫెసర్లకు కాకుండా ఇతర వర్సిటీలకు చెందిన వారికి అవకాశం కల్పించనున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

సివిల్ సర్వీసెస్‌పై దృష్టి సారించండి



మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: సివిల్ సర్వీసెస్‌పై దృష్టి సారించి మంచి సర్వీసు సాధిస్తే.. ఉన్నత స్థాయిలో సమాజ సేవ చేసే అవకాశం వస్తుందని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. ఎస్కేయూలో పీజీ చేస్తూ కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 150 మంది, 20 మంది హోంగార్డులకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తాను 26 సంవత్సరాల వయస్సులోనే ఐపీఎస్ సాధించినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అనంత రాముడు, వన్‌టౌన్ సీఐ వి.రాజేంద్రనాథ్ యాదవ్, ఇటుకలపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ మెటీరియల్ అందించేందుకు చేయూతనిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జయపాల్ యాదవ్, సురేష్, రమేష్, వీర కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాచానపల్లి సర్పంచ్‌కు గాయాలు

రాప్తాడురూరల్: ప్రమాదవశాత్తూ అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సర్పంచ్ బండా అంజియాదవ్‌కు గాయలయ్యాయి. తృటిలో పెనుప్రమాదం నుంచి బయటపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం రాచానపల్లి శివారులోని తన వ్యవసాయ పొలంలో సాగు చేసిన మొక్కజొన్నకు నీళ్లు పెట్టే క్రమంలో మోటారు ఆన్ చేశాడు. తర్వాత గేట్‌వాల్ తిప్పేందుకు ప్రయత్నిస్తుండగా అదుపుతప్పి హైస్పీడ్‌తో గేట్‌వాల్ ఎగిరి వచ్చి మొహానికి తగిలింది. ఈ ప్రమాదంలో ఎడమ కంటికి పై భాగంలో తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు ఆయన్ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి చికిత్స అందించారు. కనుబొమ్మకు ఆరుకుట్లు వేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆత్మకూరు: మండలంలోని బి.యాలేరు ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని మెటీరియల్ రూపొందించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన ఈ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో దాతలు నారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హెచ్ఎం నరహరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలోత్సవానికి విరాళం

అనంతపురం ఎడ్యుకేషన్: అనంత బాలోత్సవం-5 (పిల్లల పండుగ) నిర్వహణకు టీచరు, రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి రూ. 10,116 విరాళం ప్రకటించారు. సోమవారం బాలోత్సవ నిర్వహణ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి సావిత్రి, సభ్యులు ఎస్‌వీవీ రమణయ్యకు నగదు అందజేశారు. ఫిబ్రవరి 14,15,16 తేదీల్లో ఆర్ట్స్ కళాశాల మైదానంలో అనంత బాలోత్సవం నిర్వహిస్తున్నారు.

సైబర్ వల ..

చిక్కితే విలవిల



‘ఆత్మకూరుకు చెందిన ఓ యువకుడి ఖాతాలో చిన్న మొత్తంలో నగదు ఉన్నట్లు ఉండి మాయమైంది. ఫోన్‌పేలో చూస్తే బ్యాలెన్స్ 0 చూపిస్తోంది. దీంతో దిక్కుతోచక ఆ యువకుడు ఆత్మకూరులోని బ్యాంకును ఆశ్రయించాడు. తన ఖాతాలో నగదు ఉన్నట్లు ఉండి ఖాళీ అయిందని.. మళ్లీ నగదు వేసిన అది కూడా కనపడలేదని మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. బ్యాంకు ఖాతాను పరిశీలించి సిబ్బంది.. మీ ఖాతాను సైబర్ క్రైమ్ వారు బ్లాక్‌లో పెట్టారు. నగదు ఖాతాలో ఉంది కాని చూపించదని సమాధానం ఇచ్చారు. ఆ యువకుడు ఏం చెయ్యాలో తెలియక వెనుతిరిగి వచ్చాడు’

‘ఆత్మకూరుకు చెందిన ఓ వ్యక్తి తన ఖాతాలో రూ.1000 ఉండటంతో ఓ షాప్‌కు వెళ్లి వస్తువులు కొనుగోలు చేశాడు. డబ్బు చెల్లించేందుకు ఫోన్ పే చేయబోతే ఖాతాలో నగదు లేదని చూపించింది. దీంతో బ్యాలెన్స్ పరిశీలించగా ఉన్న రూ.1000 కనిపించకపోగా.. ఇంకో రూ.2,227 మైనస్‌లో ఉన్నట్లు చూపించింది. ఆందోళనకు గురైన యువకుడు బ్యాంకులో విచారించినా ఫలితం లేకపోయింది.

- ఉన్నట్లు ఉండి ఖాతాల్లో నగదు ఖాళీ
- లబోదిబోమంటున్న బాధితులు
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్న అమాయకులు

ఆత్మకూరు: ప్రస్తుతం ఉన్న జనరేషన్‌లో స్మార్ట్ ఫోన్ వాడే ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏం కొన్నా, ఏం తీసుకున్నా, ఏం అమ్మినా డబ్బు రూపకంగా కాకుండా ఫోన్‌పే, గూగూల్ పే వాడుతున్నారు. ఇది ఒక రకంగా ఉపయోగమే. అయినప్పటికీ చాలా వరకూ ప్రమాదమని బ్యాంకర్లు చెబుతున్నారు. కొంతమంది ఫోన్‌లలో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారు. గెలుపొందిన వారికి నేరుగా ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నారు. కానీ ఆ డబ్బు ఏ బ్యాంకు నుంచి, ఏ ఖాతా నుంచి వస్తుందో తెలియడం లేదు. ఇలా తమ ఖాతా నంబర్లు ఆన్‌లైన్‌లో ఉపయోగించడం వల్ల మోసాలు జరిగేందుకు అవకాశం ఉంది. కాగా.. మండలంలో చాలా వరకు వ్యవసాయ పనులు, కూలి పనులు చేసుకునే వారే సైబర్ మోసాలకు బలి అవుతున్నారు. చిన్న మొత్తంలో నగదు పోతే ఏదో ఒకట్రెండు రోజులు బాదపడి వదిలేస్తారు. రూ.లక్షల్లో మోసం చేస్తే ఎలా అంటూ బాధితులు ఆవేదన చెందుతున్నారు. జాగ్రత్తగా ఉండాలని పోలీసులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చాలా వరకు సైబర్ నేరగాళ్లకు గురికాకుండా ఉండండి.. ఏది లింక్ పడితే వాటిని నొక్కకండి.. ఓటీపీలు చెప్పొదని కాలర్‌టూన్‌లు కూడా వస్తున్నాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- సెల్‌ఫోన్‌లకు వచ్చే లింక్‌లు క్లిక్ చేయకుండా జాగ్రత్తగా గమనించి తెరవాలి.
- గుర్తు తెలియని వ్యక్తులకు ఆధార్ నంబర్లు, ఓటీపీలు, ఖాతా వివరాలు చెప్పరాదు.
- యూపీఐ ద్వారా చెల్లించే బ్యాంకు ఖాతాల్లో తక్కువగా డబ్బు ఉండేలా చూసుకోవాలి.
- తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తామని చెప్పే వారి మాటలు, ప్రకటనలు నమ్మరాదు.
- గుర్తు తెలియని వ్యక్తుల కాల్స్, మేసేజ్‌లకు స్పందించకుండా మీ ప్రమేయం లేకుండా ఫోన్‌లో ఏదైనా యాప్ డౌన్‌లోడ్ అయిందా చూసుకోవాలి. ఫోన్ వాడకుండానే చార్జింగ్ తగ్గుతుందంటే అనుమానించాల్సిందే.
- ఏవరైనా లాటరీ తగిలిందని.. లేదా ఆఫర్‌లో వస్తువులు తక్కువ ధరలకు వచ్చాయి.. మీకు ఇన్సూరెన్స్ నగదు వేస్తామని చెప్పే వారి మాటలు నమ్మరాదు.
- అలాంటి ఫోన్‌లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

అవగాహన కల్పిస్తున్నాం



సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని చాలా మంది డబ్బులు పొగొట్టుకుంటున్నారు. సైబర్ నేరగాళ్లతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. ఎవరికి పడితే వాళ్లకు ఓటీపీలు చెప్పరాదు. ఆధార్ కార్డులు ఇవ్వరాదు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. మండల వ్యాప్తంగా సైబర్ నేరాల నియంత్రణకు ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు మోసపోకుండా అవగాహన కల్పిస్తున్నాం.

– లక్ష్మీనారాయణ, ఎస్ఐ, ఆత్మకూరు

మార్కెట్‌లోకి కియా నూతన కారు



సైరోస్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: నగర శివారులో ఎంజీ బ్రదర్స్ కియా షోరూంలో ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో కియా సైరోస్ నూతన కారును సోమవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. షోరూం సీఈఓ ఆదిత్య మాచాని మాట్లాడుతూ.. ఈ కారు పెట్రోల్, డీజల్, మాన్యువల్, ఆటోమేటిక్ వేరియంట్‌లలో 8 ఆకర్షనీయమైన రంగుల్లో లభ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్స్ ఎల్లప్ప, గిరి ప్రసాద్, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

అనంతపురం అర్బన్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుల్లపల్లి మోహన్, ప్రధాన కార్యదర్శి మాన్లుకోసే కేశవ్, మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వర్ణ తదితరులు డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాల్లో ఎస్టీల నుంచి వ్యవస్థాగతమైన మినహాయింపును ఎదుర్కొంటున్నామన్నారు. సోమవారం కలెక్టర్ వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

జోరుగా పూడికతీత పనులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 32వ డివిజన్‌లో సోమవారం పూడికతీత పనులు చేపట్టేలా ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్ కమల్‌భూషణ్ చర్యలు తీసుకున్నారు. హౌసింగ్ బోర్డులోని ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో పెద్ద కాలువకు పూడికతీత పనులు మొదలుపెట్టారు. అనంతరం అదే డివిజన్‌లో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించారు. సాయంత్రం పారిశుధ్య కార్మికులు గ్యాంగ్ వర్క్ పనుల్లో భాగంగా వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దగ్గుపాటి అండతోనే కబ్జాలు, దాడులు



మాట్లాడుతున్న మేయర్ వసీం

- నగరాన్ని భ్రష్టు పట్టిస్తున్న ఎమ్మెల్యే అనుచరగణం
- కమీషన్ల కోసం అందరినీ పట్టిపీడిస్తున్నారు
- మేయర్ వసీం ధ్వజం

అనంతపురం కార్పొరేషన్: ప్రశాంతతకు మారుపేరు అనంతపురం నగరం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి జరిగింది. కూటమి ప్రభుత్వం 8 నెలల పాలనలో అనంతపురానికి మచ్చ తెస్తున్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రోద్బలంతో దౌర్జన్యాలు, భూకబ్జాలు, భౌతిక దాడులతో ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నారని మేయర్ వసీం ఆరోపించారు. సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, నగరాధ్యక్షుడు మన్సూర్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. నగర చరిత్రలో లేని విధంగా కక్ష సాధింపు చర్యలు అధికమయ్యాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నేతృత్వంలో నగరంలో శాంతియుత పాలన సాగిందన్నారు. ఎమ్మెల్యే అనుచరగణం సెటిల్‌మెంట్లు, కబ్జాలు, దౌర్జన్యాలతో నగరాన్ని భ్రష్టు పట్టిస్తున్నారనే చర్చ జరుగుతోందన్నారు. ఇంత దారుణాలు జరుగుతుంటే పోలీసు వ్యవస్థ ఏం చేస్తోందని ప్రశ్నించారు. అధికార పార్టీకి జీ హుజూర్ అంటూ మౌనంగా ఉండిపోయిందన్నారు. నగరంలో కొందరిపై టీడీపీ నాయకులు భౌతిక దాడులకు పాల్పడుతుంటే.. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్నారు. చికెన్ నిర్వాహకుల నుంచి చౌక ధాన్యం బియ్యం కొనుగోలుదారులు కమిషన్లు అడగడం, బెల్టుషాపులు ఏర్పాటు చేయడం, ఎగ్జిబిషన్ నిర్వాహకులను డబ్బులు డిమాండ్ చేస్తూ ప్రజలను పీడించిన సందర్భాలున్నాయన్నారు.

అభివృద్ధికి అడ్డే:
కూటమి ప్రభుత్వం ఏర్పాటైయ్యాక రూ.13 కోట్లకు పైగా అభివృద్ధి పనులను పిలిస్తే ఇంత వరకు ఒక్క పని కూడా పూర్తి కాలేదన్నారు. ఇదేమిటని కాంట్రాక్టర్లను ఆరా తీస్తే ఎమ్మెల్యే అనుచరులకు కమీషన్లు ఇవ్వలేం.. పనులు చేపట్టలేం అన్న మాట వినిపిస్తోందన్నారు. సాక్షాత్తు టీడీపీ నాయకులే సీఎం చంద్రబాబు నాయుడుకి లేఖ రాసిన విషయాన్ని తెలియజేశారు. పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో ఉండాలంటే ఎమ్మెల్యే దగ్గుపాటి మనిషి లేదా టీడీపీ కార్యాకర్త అయి ఉండాలనే పరిస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటికి తెలిసే టీడీపీ చోటా నాయకులు దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, నగరాధ్యక్షుడు మన్సూర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత అభివృద్ధిపై దృష్టి సారిస్తే..కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్వలాభం కోసం పని చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేటర్లు కమల్‌భూషణ్, రహంతుల్లా, నాయకులు షరీఫ్, కుళ్లాయస్వామి, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, ఇషాక్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంస



కలెక్టర్ వినోద్ కుమార్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న కలెకరేట్ సీసీ డి.భరత్



కె.శ్రీనాథ్ బాబు, జేఏ



ఎస్.జిలాన్ బాషా, జేఏ



అఫ్జల్, డీఆర్ఓ సీసీ



వాణిశ్రీ, కేఆర్ఆర్‌సీ తహసీల్దార్

అనంతపురం అర్బన్: విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులను ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సన్మానించారు. కలెక్టర్ వి.వినోద్ చేతుల మీదుగా పలువురు అధికారులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

ఉద్యోగుల ఎంపికలో అన్యాయం

అనంతపురం అర్బన్: విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేశారు. అయితే అధికారుల ఎంపికలో ప్రామాణికత లోపించింది. అవార్డుల ఎంపికలో ప్రధానంగా ఒక అధికారి అంతాతానై వ్యవహించిన తీరుపై ఉద్యోగులు మండిపడుతున్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పనిచేసే తోటమాలీలు, అటెండర్లు, వాచ్‌మెన్‌లు, తదితరులు 36 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. 81 శాఖలకు సంబంధించి శాఖకు ఒకరిద్దరు లేదా ముగ్గురిని ఎంపిక చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే ప్రధానమైన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేసే నర్సులు, మునిసిపాలిటీలు, పంచాయతీ శాఖలో పనిచేసే పారిశుధ్య కార్మికులను విస్మరించారు. దాదాపు 700 మంది ఉద్యోగులున్న ఖజానా శాఖలో కనీసం ఒక్క ఉద్యోగిని కూడా అవార్డుకు ఎంపిక చేయకపోవడంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై పోరాడదాం



పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంతను సన్మానిస్తున్న బీసీ విభాగం నగరాధ్యక్షుడు బోయ లక్ష్మన్న, ట్రేడ్ యూనియన్ నగరాధ్యక్షుడు షేక్ ఖాజా



అనంతను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నగరాధ్యక్షుడు పసులూరి ఓబులేసు

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు అనంతను ఆయన నివాసంలో వివిధ విభాగాల అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంతకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. అధికారంలో లేకున్నా ప్రజల సమస్యలపై పోరాడుదామన్నారు. జిల్లా అధ్యక్షుడు అనంతను కలసిన వారిలో పార్టీ బీసీ విభాగం నగరాధ్యక్షుడు బోయ లక్ష్మన్న, ఎస్సీ విభాగం నగరాధ్యక్షుడు పసులూరి ఓబులేసు, వలంటీర్ల విభాగం నగరాధ్యక్షుడు కోనా రాజా రెడ్డి, బూత్ కమిటీ విభాగం నగరాధ్యక్షుడు బోగాతి రవీంద్ర రెడ్డి, ట్రేడ్ యూనియన్ నగరాధ్యక్షుడు షేక్ ఖాజా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనుబంధ విభాగాల అధ్యక్షులు సాకే చంద్ర, ఓబిరెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, మల్లె మీద నరసింహులు, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సంపంగి రామాంజనేయులు, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అఖిల్ కుమార్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అఖిల్ కుమార్ రెడ్డిని ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు నూజిళ్ల శ్రీనివాసులు తెలిపారు. ఎస్కేయూలోని న్యాయ విభాగంలో ఎల్ఎల్‌బీ చదువుతున్న అఖిల్ కుమార్ రెడ్డి.. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 24, 25, 26 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల్లో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

అనంతపురం సిటీ: శ్రీనివాస నగర్‌లోని బాలాజీ ప్రార్థనా మందిరం (కళ్యాణ మండపం)లో సోమవారం తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. విశ్రాంత పోస్టుమాస్టర్ ఎస్.చంద్రశేఖర చారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.వన్నప్ప, సెక్రటరీగా జి.శ్రీధర్ బాబు, ట్రెజరర్‌గా టీకే కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఎన్నుకున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

కదిరి సీఐపై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: ఎటువంటి విచారణ చేయకుండా బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసిన కదిరి సీఐపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నారాయణ స్వామి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టవర్‌క్లాక్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్‌పై రాజకీయ ఒత్తిళ్లతో కదిరి సీఐ కేసు నమోదు చేయడం దారుణమన్నారు. తక్షణమే సీఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మల్లికార్జున నాయక్, అక్కులప్ప, నగేష్, శాంతకుమార్, రాజశేఖర్, శివ శంకర్, చైతన్య, ఆనంద్, సుదర్శన్, రామకృష్ణ, రామాంజనేయులు, పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సమస్యలకు పరిష్కారం చూపాలి

అనంతపురం కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుకుల సకాలంలో పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ మల్లికార్జున రెడ్డి అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, తదితర విభాగాలకు సంబంధించి 4 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏసీపీ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అనంతలో ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా అనంత వేదికగా చిత్రోత్సవాన్ని కొనసాగిస్తున్నామని సినీ దర్శకుడు రషీద్ అన్నారు. పెద్ద నగరాలకే పరిమితమైన 7వ లఘుచిత్రోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక జేజే కన్వెన్షన్ హాల్లో 16 మంది యాడ్ డైరెక్టర్లను అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో అబ్బా టీవీ డాక్టర్ హరిప్రసాద్, పారిశ్రామికవేత్త ముడార్ సుధీర్, సామాజిక సేవా కార్యకర్తలు అనిల్‌కుమార్‌రెడ్డి, రవికాంత్ రమణ, తోట బాలన్న, నటుడు రమేష్, సీనియర్ మాస్టర్ కత్తి విజయ్‌కుమార్, జీఎంఎస్ గ్యాలరీ అధినేత సురేష్, కవులు టీవీరెడ్డి, నబిరసూల్, విజయ్‌కుమార్, అల్తాఫ్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి

అనంతపురం అర్బన్: ఉప్పరపల్లి గ్రామ పొలం సర్వే నంబర్ 194లోని మూడు ఎకరాల్లో గుడిసెలు వేసుకుని ఏళ్లగా జీవనం సాగిస్తున్న తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ముత్యాలమ్మ, సునీతమ్మ, నరసింహులు, పెద్దన్న, లక్ష్మీనారాయణ, బాషా కోరారు. కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

రేషన్ కార్డులు అందజేయాలి

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయలేదని సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. తహసీల్దార్ లక్ష్మీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రేషన్ కార్డుల మంజూరుకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు.

జాతర సందడి

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలో సోమవారం జాతర సందడి నెలకొంది. 50 సంవత్సరాల అనంతరం జాతర జరుగుతుండటంతో గ్రామస్తులు బంధువులను పెద్ద ఎత్తున ఆహ్వానించారు. పెద్దమ్మ, ముత్యాలమ్మ దేవతలను పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు చేపట్టారు. ఆలయాలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం తెల్లవారుజామున దున్నపోతులను బలి ఇచ్చారు. పెద్దమ్మ దేవతకు యువతులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణింపు

అనంతపురం: సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణిస్తారని జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం, శ్రీ సత్యసాయి శ్రీసేవా సంస్థ, సంయుక్తంగా కలిసి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లకు విపత్తు నిర్వహణ శిక్షణ శిబిరం నిర్వహించారు. విపత్తుల సమయంలో సరైన ప్రతిస్పందన, తగిన సన్నద్ధతకు అవసరమైన నైపుణ్యాలు, సీపీఆర్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ శారద, రాకేష్ తేజ్, డాక్టర్ ఆర్. రామచంద్రమూర్తి, ఎన్. నరసింహప్ప, శ్రీ సత్యసాయి సేవా సంస్థ విపత్తు నిర్వహణ ఇన్‌చార్జ్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌సాయికి ఎక్స్‌లెన్సీ అవార్డు

అనంతపురం కల్చరల్: మైసూరు మహారాజా ప్యాలెస్ రాజుల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద స్వామి 162వ జయంతి వేడుకలు నెల రోజుల పాటు నిర్వహిస్తున్నారు. మైసూరు మహారాజ చేతుల మీదుగా అనంత సామాజిక సేవాకార్యకర్త విజయ్‌సాయి రాయల్ ఇన్‌స్పైర్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకున్నారు.

మద్యం విక్రయాలు నియంత్రించాలి

అనంతపురం అర్బన్: మద్యం విక్రయాలు నియంత్రించాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతిప్రసాద్, పద్మావతి, ఏఐవైఎఫ్ కార్యదర్శి సంతోష్ కుమార్ కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. బెల్ట్ షాపుల గురించి ఎక్సైజ్ అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఆర్‌పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం టవర్‌క్లాక్: ఉద్యోగుల హక్కుల సాధనకు అందరూ కలసి రావాలని ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్‌పీఎస్ కార్యలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆర్‌పీఎస్ రాష్ట్ర కన్వీనర్‌గా ఆర్.నారాయణ నాయక్, కో-కన్వీనర్‌గా వైజాగ్ చిట్టయ్య, విజయవాడ హరికృష్ణ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈరన్న వ్యాసానికి ప్రశంసలు

అనంతపురం కల్చరల్: అనంతకు చెందిన యువకవి ఈరన్న రాసిన వ్యాసాన్ని శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ప్రశంసించారు. చెన్నైలోని విశ్వవిద్యాలయం తెలుగు శాఖ వారు ఉత్తమ వ్యాసాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఉత్తమ సేవా పురస్కార గ్రహీతకు శుభాకాంక్షలు



శ్రీ J.V. రమేష్ గారు Executive Engineer,
Operation Town Division, APSPDCL, ATP
గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యుత్ శాఖలో విశిష్ట సేవలు అందించినందుకు గాను
గౌ॥ K. SANTHOSH RAO, Chairman & MD, APSPDCL, Tirupati గారి
చేతుల మీదుగా తిరుపతిలో ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న శుభసందర్భంగా
మా సార్‌గారైన శ్రీ J.V. రమేష్ గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
G. చంద్రశేఖర్, DEE Town-1, ATP
S. శ్రీనివాసులు, DEE Town-2, ATP
K. రఘు, DEE ATP RURAL-EAST
రవిశంకర్, DEE WEST, ATP
ALL Asst. ENGINEER'S & OFFICE STAFF, A.P.S.P.D.C.L., Anantapuramu Division

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220732, 9912220719, 9912220724
9010223702, 9908363676, 9010567770, 8008554500